ఉల్లాసానికి వేదికగా హ్యాపీ స్ట్రీట్

- హోంమంత్రి తానేటి వనిత
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్‌కుమార్



హ్యాపీస్ట్రీట్‌లో సందడి చేస్తున్న హోంమంత్రి వనిత, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ డాక్టర్ మాధవీలత, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఆటలు, వినోదం, ఉల్లాసానికి వేదికగా హ్యాపీస్ట్రీట్ నిలుస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాల వద్ద పరమహంస యోగానంద మార్గ్ (వాకర్స్ స్ట్రీట్)లో తీర్చిదిద్దిన హ్యాపీస్ట్రీట్‌ను ఎంపీ మార్గాని భరత్ రామ్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ స్టేట్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వనిత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పూణే, ముంబై నగరాల్లో ఉండే హ్యాపీ స్ట్రీట్‌ను మన నగర వాసులకు పరిచయం చేస్తున్నామన్నారు. కాలంతో పాటు పరిగెడుతున్న మనకు విశ్రాంతి ఉండటం లేదని, కనీసం ఆదివారం ఆ ఒత్తిడిని అధిగమించేందుకు ఈ హ్యాపీస్ట్రీట్ దోహదపడుతుందన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం అభివృద్ధి కోసం రూ.8 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర పాలక సంస్థ అధికారులు పాండురంగారావు, డాక్టర్ వినూత్న పాల్గొన్నారు. హ్యాపీస్ట్రీట్ కార్యక్రమం చిన్నారుల కేరింతలు, డ్యాన్సులు, ఆటపాటలతో హుషారుగా సాగింది.



డ్యాన్స్ చేస్తున్న యువత



ఆకట్టుకున్న స్కేటింగ్

నేడు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని పర్యటన

కంబాలచెరువు: రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరుకుని, అక్కడ వైద్య వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తారు. 10.50 గంటలకు బ్లోస్సమ్స్ మదర్ చైల్డ్ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. 11.40 వరకు వరకు ఐకాన్ రోడ్ ప్రారంభోత్సవం, 12.15 గంటలకు యువత హరిత కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారు. అనంతరం ఒంటిగంటకు కోరుకొండ మండలం కోటికేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. రెండు గంటలకు శ్రీరంగపట్నంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి సాయంత్రం నాలుగు గంటలకు కాకినాడ జీజీహెచ్‌కు వెళతారు.

రాజమహేంద్రవరం చేరుకున్న మంత్రి

కాగా, జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి రజిని ఆదివారం రాత్రి 10.30 గంటలకు నగరంలోని హోటల్ షెల్టాన్‌కు చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేశారు.

ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలి

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో గడప గడపకూ..



కడియంలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియంలోని సచివాలయం 4 పరిధిలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్న తీరును తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని, వారికి ఎందుకు ఆయా పథకాలు అందడం లేదన్న దానిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డా బుజ్జి, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, స్థానిక నాయకులు సాకా పట్టాభి, గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

- హోంమంత్రి తానేటి వనిత
- కడియపులంకలో కమ్యూనిటీ హాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్, చందన నాగేశ్వర్

కడియం: రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చుతున్నారని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. ఆనం ఎలక్ట్రికల్స్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి రూ.9 లక్షలు, పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో కడియపులంక దళితవాడలో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి హోంమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గత ఎంపీటీసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కడియపులంక ఎస్సీపేటలో కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇందుకు కృషి చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు)ను అభినందించారు. రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్ చంద్రస్టాలిన్ తదితరులు మాట్లాడారు. అంతకు ముందు కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులను దళిత యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, సర్పంచ్ మార్గాని అమ్మాజీ, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు చీకట్ల మాచరయ్య, ఊటుకూరి శైలజ, గాద రామకృష్ణ, ఆరేటి వెంకట్రావు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు అంబేడ్కర్ యువజన సంఘం స్వాగతం పలికింది.

సేవాకార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళిక



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న కేశవభట్ల శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని పేదల నివాస ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు ప్రకటించారు. బొమ్మూరులోని కొత్తపేట బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లో ఈనెల 16న నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గుర్తించిన వారికి రైల్వే అధికారి సయ్యపురాజు ఫణీంద్రబాబు సహకారంతో ఆదివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఫణీంద్రబాబు మాట్లాడుతూ కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎన్ జే.చంద్రన్, విశ్రాంత యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముత్యాల సూర్యనారాయణ, రైల్వే సీటీఐ సుంకర చంద్రమౌళి, రైల్వే టీటీఐలు కునిశెట్టి సతీష్, బండారు శ్రీను, మెహర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఫూలే - అంబేడ్కర్ కమ్యూనిటీ భవనానికి నేడు శంకుస్థాపన



ఫూలే - అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు శంకుస్థాపన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలో ఫూలే - అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రాష్ట్ర ఆరోగ్యం, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని సోమవారం శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. గోదావరి గట్టున జ్యోతిరావు ఫూలే విగ్రహానికి ఎదుట ఉన్న 1,200 చదరపు గజాల స్థలంలో ఫూలే - అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. కింద పార్కింగ్, పైన కమ్యూనిటీ హాలు, దానిపైన స్టడీ సర్కిల్ నిర్మిస్తామని తెలిపారు. బీసీ, ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచి, అక్కడే చదువుకునేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ భవన నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని, ఎంపీ నిధుల నుంచి తాను రూ.కోటి ఇస్తున్నానని, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు రూ.50 లక్షలు, మోపిదేవి వెంకట రమణ రూ.25 లక్షలు ఇప్పటికే ప్రకటించారని చెప్పారు. ప్రతి పైసా పారదర్శకంగా ఖర్చు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నయనాల కృష్ణారావు, నల్లా గంగాధర్, గుబ్బల రాంబాబు, బొమ్మన జయకుమార్ తదితర 25 మంది ప్రముఖులతో బిల్డింగ్ కమిటీ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫూలే - అంబేడ్కర్ సామాజిక భవనాలు జిల్లాలో 100 నిర్మించాలనుకుంటున్నామని ఎంపీ చెప్పారు. కమ్యూనిటీ హాలు శంకుస్థాపనకు సంబంధించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా ఎంపీ ఆవిష్కరించారు. విలేకర్ల సమావేశంలో మార్గాని నాగేశ్వరరావు, నయనాల కృష్ణారావు, నక్కా శ్రీనగేష్, మహ్మద్ ఆరీఫ్, మజ్జి అప్పారావు, హబీబుల్లా ఖాన్, గుబ్బల రాంబాబు, పిల్లి నిర్మల, కేకే సంజీవరావు, బర్రే కొండబాబు, పితాని రామకృష్ణ, దాసి వెంకటరావు, నక్కెళ్ళ బాబూరావు, కడలి వెంకటేశ్వరరావు, కానుబోయిన సాగర్, రేలంగి సత్యనారాయణ, జొన్నాధుల రమేష్, గుత్తుల మురళీధర్, కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి



నిడిగట్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ..

మధురపూడి: పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో మూడోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బడుగుల అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొంటూ సంక్షేమ పథకాలను అమలు జరిపారన్నారు. నిడిగట్లలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. దీనిలో భాగంగా సుమారు వంద గడపలకు వెళ్లిన ఎమ్మెల్యే.. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, పార్టీ నాయకులు నాళం రోషయ్య, యడ్ల సత్యనారాయణ, పళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

అనపర్తి: మండలంలోని పొలమూరులో పునర్నిర్మించిన రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహాలతో పాటు, వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఈ నెల 29 నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 29న సంకల్ప దీక్ష, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, కంకణధారణ జరుగుతాయని నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 30న నవకలశ స్నపన, పంచగవ్యాధివాసం, మే 1న అగ్నిప్రణయనం, క్షీరాధివాసం, అధివాస హోమం, 2న జలాధివాసం, నయనాధివాసం, 3న యంత్రస్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ అనంతరం సాయంత్రం రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాలస్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, పార్టీ నాయకుడు సత్తి వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం అప్పన్నకు ఎంపీ పూజలు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖ జిల్లా సింహాచలం అప్పన్న చందనోత్సవంలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, మోనా దంపతులు ఆదివారం తెల్లవారుజామున పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి పండితులు వేదాశీసులు అందజేశారు. గుర్రం గౌతమ్, మార్గాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారంతో మరింత ప్రోత్సాహం

సీటీఆర్ఐ: చేసిన అభివృద్ధిని మెచ్చుకుంటూ చేసే సత్కారం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని, నగరాభివృద్ధికి మరింత బాధ్యతను గుర్తుచేస్తుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని ఏవీఏ రోడ్డు సీఎస్ఎన్ చర్చిలో రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎంపీ భరత్ రామ్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ డాక్టర్ ప్రతాప్ సిన్హా కొమ్మానపల్లి, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ రెవ.డాక్టర్ జుహానీ హాలోనెన్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కోశాధికారి టాటా విక్టర్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి డాక్టర్ కె.మోజెస్ బాబు, అడిషనల్ సెక్రటరీ ఎం విజయసారథి పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడులో కొలువైన గణపతి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం గణపతిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఏకాదశ దీక్షలు ప్రారంభం

అనపర్తి: మండలంలోని పొలమూరులో శ్రీకృష్ణ ఏకాదశ దీక్షలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని భక్తులు 11 రోజుల పాటు ఏకాదశ దీక్షను చేపట్టారు. వేద పండితులు వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో దీక్షధారులు స్వామి వారి మాల ధారణ చేపట్టారు. ఆదివారం స్వామివారికి శాంతికర కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సూరారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి వీరయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధిని చూడలేకే విమర్శలు

రాజమహేంద్రవరం రూరల్: నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే, ప్రతిపక్ష టీడీపీ, జనసేన నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, వారు నోరు అదుపులో ఉంచుకుంటే మంచిదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నగరంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆస్వాదిస్తుంటే, టీడీపీ, జనసేన నాయకులకు మాత్రం కడుపుమంట వస్తోందన్నారు. సిటీ అర్బన్ ఎమ్మెల్యేను కించపరచడం లేదని, ఆమె సోదరితో సమానమని ఎంపీ భరత్ అన్నారు. కానీ ఒక ప్రజాప్రతినిధిగా ఏమి చేశారని అడుగుతున్నామన్నారు. ఏది ఏమైనా నగరంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నదే తమ అంతిమ లక్ష్యమన్నారు. రాజమహేంద్రవరం సిటీ వైఎస్సార్ సీపీ టికెట్ ఎవరికిస్తారన్నది ఇప్పుడు అప్రస్తుతమని, ఎవరికిచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయడం తన ముందున్న కర్తవ్యమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే.. దేనికైనా సీఎం జగన్ ఆదేశాల మేరకేనని అన్నారు.

త్వరలో నూతన కమిటీలు

సీటీఆర్ఐ: ఎంఆర్‌పీఎస్‌లో అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేసి, సంఘాన్ని బలోపేతం చేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి వైరాల అప్పారావు అన్నారు. స్థానిక తాడితోటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో అధ్యక్షుడు మందకృష్ణ కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు.

హరినామ సంకీర్తన



హరినామ సంకీర్తన చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: హరినామ సంకీర్తన ప్రారంభించి ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈవారం విశేషమైన సంకీర్తన, ప్రసాద వితరణ నిర్వహించినట్లు ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ కార్యదర్శి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పుష్కర ఘాట్ వద్ద హరినామ సంకీర్తన, ప్రసాద వితరణ జరిపారు. మిషన్ ఫౌండర్ ఆచార్య శ్రీల భక్తీ వైభవ పూరీ గోస్వామి మహరాజ్ దివ్య ఆశీసులతో, వర్తమాన ఆచార్య దేవశ్రీ భక్తి కంకణ వనమహారాజు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

సేవే ప్రధాన లక్ష్యంగా వాసవీ క్లబ్‌ల పయనం



మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గాయత్రి

రాజమహేంద్రవరం సిటీ: స్నేహం, సేవ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యాలుగా వాసవీ క్లబ్‌లు పనిచేస్తున్నాయని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి అన్నారు. ఆదివారం గౌతమ ఘాట్ చాంబర్ కల్యాణ మండపంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ (మల్టిపుల్) బోడా సాయి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని 9 రాష్ట్రాల్లో ఉన్న 38 వాసవీ డిస్ట్రిక్ట్స్‌లో లక్ష మంది సభ్యులున్నారన్నారు. 1961లో 11 మంది సభ్యులతో ప్రారంభమైన వాసవీ క్లబ్‌లు దేశవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, సెక్రటరీ ఈ.రామకృష్ణ, కోశాధికారి ఐఎన్‌వీ సంతోష్ చక్రవర్తి, బోడా సాయి సూర్య ప్రకాష్, శిఘాకొల్లి కరుణ కుమార్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అనపర్తి: వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామానికి చెందిన మేడపాటి సుబ్బారెడ్డి ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఆదివారం అనపర్తిలో జరిగే సంతకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా కట్లమ్మ తల్లి మేలుకొలుపు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామ దేవత కట్లమ్మ తల్లి మేలుకొలుపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి గరగ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మే 4న జాతర, 5వ తేదీన అమ్మవారి తీర్థానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాల సమీపంలో ఐదు మద్యం బాటిళ్లు కలిగి ఉన్న నరాల రమణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు.

దంచి కొట్టిన వర్షం



నీటమునిగిన రామచంద్రపేట రోడ్లు



ఈదురు గాలులకు కూలిపోయిన చెట్టు



లింగంపేట వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ: నగరంలో ఆదివారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. ఆగకుండా మూడు గంటలు వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రి, కంబాల చెరువు, వెంకటేశ్వర నగర్, సబ్బారపువారి వీధిలో నేలకొరిగాయి. డ్రైనేజీలు పొంగిప్రవహించాయి. సుమారు 18.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అయితే వేసవి తాపంతో అల్లాడిపోతున్న జనాలకి కొంచె ఉపశమనం కలిగింది.



కంబాలచెరువు వద్ద వాహనచోదకుల పాట్లు



కంబాలచెరువు వద్ద వర్షంలోనే రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు